సాక్షి ప్రకాశం
మంగళవారం । 14 । మే । 2024



పచ్చ దండుపాళ్యం

ఓటమి భయంతో టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు తెగబడ్డారు. జిల్లాలో పలుచోట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారు. ఎక్కడికక్కడ గొడవలు సృష్టించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36.3/27

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.



ఒంగోలు సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు



మార్కాపురం జెడ్పీ గరల్స్ హైస్కూల్లో క్యూలో ఉన్న ఓటర్లు

ఓటుగాలి వీచింది..



రాత్రి 11.30ని॥ లకు అందిన సమాచారం మేరకు జిల్లాలో పోలింగ్ శాతం 82.63. మహిళలే నిర్ణేతలు

పల్లె నుంచి పట్నం దాకా ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పోటెత్తారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా బూత్‌ల వద్ద జన జాతర నెలకొంది. వృద్ధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేము సైతం అంటూ దివ్యాంగులు కూడా చైతన్యంతో పోలింగ్ కేంద్రాలవైపు కదిలారు. మండుటెండను సైతం లెక్కచేయలేదు. రాత్రి ఎనినిమిది గంటలు దాటినా పలు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ క్యూలు కనిపించాయి. కడపటి వివరాలు అందే సరికి జిల్లా వ్యాప్తంగా 82.63 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లలో సంక్షేమ గాలి వీచిందని వైఎస్సార్ సీపీ నేతలు ఉత్సాహంగా కనిపించారు.

- ఓటు వేసేందుకు ఉత్సాహంగా కదం తొక్కిన మహిళలు, వృద్ధులు
- జిల్లాలో 2183 కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం
- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలతో పోలింగ్ జాప్యం
- తెల్లవారుజామున ఆరు గంటల నుంచే క్యూకట్టిన ఓటర్లు
- ఆలస్యమైనా ఉత్సాహంగా ఓటు వేసిన ప్రజలు
- సాయంత్రం 6 గంటలకు 73.05 శాతం పోలింగ్ నమోదు
- 6 గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల్లో వందలాదిగా ఓటర్లు
- రాత్రి 10 గంటల వరకూ క్యూలోనే ఉండి ఓటేసిన వైనం
- ప్రకాశం భవన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యవేక్షణ
- భద్రతా చర్యలపై ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్ నిరంతర సమీక్ష



ఒంగోలులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



దర్శిలో ఓటు వేసిన అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, నందిని



మార్కాపురంలో ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



కవలకుంట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్



మల్లవరంలో పోలింగ్ బూత్ వద్ద కుటుంబ సమేతంగా ఓటేసిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఓటు వేసిన అనంతరం కలెక్టర్ దినేష్ కుమార్



ఒంగోలు రామ్‌నగర్ మున్సిపల్ హైస్కూల్లో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. ఇక మిగిలింది వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యమే. సోమవారం జిల్లాలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు చైతన్యంతో పోటెత్తారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం అయిన పోలింగ్ ప్రక్రియలో ఆరు గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. నిబంధనల ప్రకారం సాయంత్రం 6 గంటలకు బూత్‌ల్లోకి ఓటర్లు ప్రవేశించకుండా పోలీసులు గేట్లు మూతేశారు. పోలింగ్ సమయంలో ముగిసేలోగా బూత్‌ల వద్ద క్యూలో ఉన్న వేలాది మంది రాత్రి పది గంటల వరకూ వేచి ఉండి ఓటు వేశారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో కేంద్రాలకు తరలివచ్చారు. తొలి గంట నుంచి చివరి నిమిషం వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు నిర్దేశించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రి తరలించి సోమవారం ఉదయం 5 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించి అనంతరం 7 నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. పోలింగ్ సాగుతున్న తీరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ కలెక్టరేట్‌లోని కంట్రోలు రూములో లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో భద్రతా చర్యలను ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి జిల్లాలో పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 74.21 శాతం, అసెంబ్లీ నియోజకవర్గాల్లో 73.05 శాతం ఓటింగ్ నమోదు అయింది. 6 గంటలకు పోలింగ్ సమయం అయిన తర్వాత పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చి వేచి ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

పోలింగ్ ప్రక్రియ జాప్యం

జిల్లాలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ప్రక్రియ కొంత జాప్యం అయింది. మరికొన్ని చోట్ల విద్యుత్ అంతరాయం రావడంతో పోలింగ్ ఆలస్యంగా కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, షామియానాలు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల దూరంలో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా 200 మీటర్ల అవతల రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్దేశించిన సైజులో షామియానా ఏర్పాటు చేసుకుని ఓటర్లకు అవసరమైన స్లిప్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో అక్కడక్కడా చెదురుముదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్ర్ల వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు హల్‌చల్ చేశారు.

కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ

జిల్లా కేంద్రంలోని ప్రకాశం భవనంలో 16 మంది నోడల్ అధికారులతో వివిధ విభాగాలతో ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచే జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేలా పెద్ద ఎల్‌ఈడి స్క్రీన్‌ను ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.



ఒంగోలులో ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, శ్రీకావ్య



చీమకుర్తి మండలంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



వల్లూరులో పోలింగ్ బూత్ వద్ద మంత్రి ఆదిమూలపు సురేష్



మార్కాపురంలో ఓటు వేసిన అన్నా రాంబాబు



నర్సమాంబపురంలో ఓటు వేసి బయటకు వచ్చిన కనిగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ

రైజ్ ఇంజనీరింగ్ కాలేజీకి ఈవీఎంలు



పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకెళ్తున్న సిబ్బంది

సోమవారం పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సీల్స్ వేసి కట్టుదిట్టమైన భద్రత మధ్య నియోజకవర్గాల వారీగా జిల్లాలో ఏర్పాటు చేసిన 5 ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను సంబంధిత పోలింగ్ కేంద్రాల పీఓలు, ఏపీఓలు జమ చేశారు. యర్రగొండపాలెం, మార్కాపురం నియజకర్గం లోని ఈవీఎంలు మార్కాపురంలోని ఎస్‌వీకేపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజిలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూములకు. దర్శి నియోజకవర్గంలోని ఈవీఎంలు దర్శిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూముకు, ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల ఈవీఎంలు రైజ్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూములకు, గిద్దలూరు నియోజకవర్గంలోని ఈవీఎంలను సెయింట్ పాల్స్ కాలేజిలోని ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూముకు, కనిగిరి నియోజకవర్గంలోని ఈవీఎంలను అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలోని ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఆయా ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్‌రూముల నుంచి జిల్లాలోని మొత్తం నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ రైజ్ ఇంజనీరింగ్ కాలేజ్‌లోని స్ట్రాంగ్ రూముకు తరలించి భద్రపరిచారు.



కూటాగుండ్లలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని మంచంపై తీసుకొస్తున్న దృశ్యం



పిల్లల్ని ఎత్తుకుని మరీ ఓటేసేందుకు వచ్చిన మహిళలు



ఈవీఎంకు లాక్ వేస్తున్న పోలింగ్ సిబ్బంది

బాక్సుల్లో భవితవ్యం

జిల్లాలో ఎన్నికల బరిలో పార్లమెంట్ నియోజవకర్గంలో 25మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 140 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచారు. పోటీలో నిలిచిన వారిలో వైఎస్సార్ సీపీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఉండగా అసెంబీ నియోజకవర్గాలకు సంబంధించి ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండపిలో ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడులో మేరుగు నాగార్జున, మార్కాపురంలో అన్నా వెంకట రాంబాబు, గిద్దలూరులో కుందురు నాగార్జునరెడ్డి, దర్శిలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెంలో తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరి నుంచి దద్దాల నారాయణ ఎన్నికల బరిలో ఉన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ, రిజిస్టర్ అయ్యి గుర్తింపు లేని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరి భవితవ్యం ఈవీఎం బాక్సుల్లో నిక్షప్తమై ఉంది.

ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు మృతి



మృతి చెందిన పాలపర్తి అంజమ్మ

టంగుటూరు: ఓటు విలువ తెలిసిన ఓ వృద్ధురాలు తన హక్కు వినియోగించుకోవడానికి వెళ్లి విగత జీవిగా మారింది. ఈ ఘటన ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని మర్లపాడులో సోమవారం జరిగింది. పాలపర్తి అంజమ్మ (65) అనే వృద్ధురాలు స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 173 లో ఓటు వేయడం కోసం క్యూలైన్లో నుంచుంది. అయితే ఓటర్లతో క్యూలైన్ కిక్కిరిసిపోవడంతో అంజమ్మకు ఊపిరి ఆడలేదు. ఈ క్రమంలో అపస్మారక స్థితికి వెళ్లిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అదే బూత్‌లో ఓ యువతి కూడా సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు అప్రమత్తమై ఆమెకు సపర్యలు చేయడంతో కోలుకుంది.

ఉద్రిక్తతలు సృష్టించినా బంపర్ మెజార్టీతో గెలుపు నాదే

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ప్రతిపక్షాలు ఎన్ని ఉద్రిక్తతలు సృష్టించినా బంపర్ మెజార్టీతో గెలుపు తనదే అని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఉమామహేశ్వర కాలేజీ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను పోలింగ్ బూత్‌ల వద్దకు రానివ్వడంలేదని, కానీ పోలింగ్ బూత్‌ల్లోకి కూడా ప్రతిపక్షాల నాయకులు, కార్యకర్తలను అనుమతిస్తున్నారన్నారు. కేవలం బీజేపీతో కూటమి పొత్తు అనే ఉద్దేశంతో పోలీసులు కూడా ప్రతిపక్ష కూటమికే సహకరిస్తున్నారన్నారు. అయినా జనం తమ వైపు ఉన్నారని బంపర్ మెజార్టీతో గెలుస్తామన్నారు. మహిళలు పెద్ద ఎత్తున తమ పార్టీ పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ కనబరుస్తున్నారని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో మారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. ఎవరు ఎన్ని ఉద్రిక్తతలు సృష్టించినా తాము గమనిస్తూనే ఉన్నామని, కానీ వారి చేష్టలకు ప్రజలే బుద్ధిచెప్పేందుకు క్యూలైన్లలో సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట సతీమణి శచీదేవితోపాటు మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.





ఓటేయడానికి వస్తున్న వృద్ధురాలు, దివ్యాంగురాలు



నందనవనంలో ఓటేసిన 105ఏళ్ల వృద్ధురాలు సుబ్బమ్మ

పోలింగ్ ప్రశాంతం

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి కమాండ్ కంట్రోలు సెంటర్‌లో పోలింగ్ నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పోలింగ్ నిర్వహించామన్నారు. మొదటి మూడు గంటల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది చక్కటి విధులు నిర్వహించారన్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా యంత్రాంగం ఓటు హక్కుపై కల్పించిన అవగాహనతో ఓటర్లు భారీగా ఓటు వేశారని తెలిపారు.

నెమ్మదిగా ప్రారంభమై జోరందుకుని..

- రాత్రి 11.30 గంటల సమయానికి జిల్లాలో 82.63 శాతం ఓటింగ్ నమోదు
- అత్యధికంగా సంతనూతలపాడులో 86.17 శాతం, అత్యల్పంగా కొండపిలో 79.93 శాతం ఓటింగ్
- మొదటి రెండు గంటలు మినహా ఉదయం 9 గంటల నుంచి పోటెత్తిన ఓటర్లు
- పురుషుల కంటే మహిళా ఓట్లే అధికం



టంగుటూరు మండలం మర్లపాడులో సాయంత్రం 4.20 గంటలకు బారులు తీరిన ఓటర్లు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కేవలం 9.67 శాతం నమోదైంది. ఆ తర్వాత 9 నుంచి 11 గంటలకు 23.54 శాతం, 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 40 శాతం, అప్పటి నుంచి సాయంత్రం 3 గంటల వరకు 51.31 శాతం, ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు 73.5 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల్లో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఓటర్లు క్యూలైన్లలో ఉన్నారు. వారంతా ఓటు వేసే సరికి రాత్రి 9 గంటలైంది. దీంతో ఓటింగ్ శాతం మరింత పెరిగింది. తొలి నాలుగు గంటల్లో అత్యల్పంగా మార్కాపురం నియజకవర్గంలో 20.45 శాతం ఓటింగ్ నమోదు కాగా, ఆ తర్వాత మూడు గంటల సమయానికి మార్కాపురంలో అత్యధికంగా 52.91 శాతం నమోదైంది. తొలి నాలుగు గంటల్లో ఒంగోలు నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదైనా.. ఆ తర్వాత కొంత మేరకు తగ్గింది. మొత్తం మీద 6 గంటల సమయానికి దర్శిలో 76.23 శాతం ఓటింగ్ నమోదవగా, కొండపిలో అత్యల్పంగా 69.4 శాతం ఓటింగ్ నమోదైంది. రాత్రి 11 గంటలు దాటే నాటికి 15,04,964 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో 7,43,264 మంది పురుషులు, 7,61,662 మంది మహిళలు, ఇతరులు 78 మంది ఉన్నారు.

జిల్లాలో పోలింగ్ సరళి ఇలా...

నియోజకవర్గం	ఉదయం 9 గంటలకు	ఉదయం 11 గంటలకు	మధ్యాహ్నం 1 గంటలకు	మధ్యాహ్నం 3 గంటలకు	సాయంత్రం 4 గంటలకు	సాయంత్రం 6 గంటలకు	రాత్రి 11 గంటలకు
యర్రగొండపాలెం	8.52	32.23	36.83	49.3	59.28	72.79	81.58
దర్శి	9.50	21.55	39.95	51.44	67.03	76.23	83.89
సంతనూతలపాడు	11	24.57	43.98	57.95	65.76	79.5	86.17
ఒంగోలు	12.52	26.92	38.16	50.66	71.05	72.68	82.15
కొండపి	12	24.13	37.08	49.10	65.3	69.4	79.93
మార్కాపురం	5.73	20.45	42.10	52.91	61.38	75.51	84.08
గిద్దలూరు	9.57	24.21	40.54	52.85	61	74	81.43
కనిగిరి	8.78	22.41	41.43	52.78	62.36	74.19	81.87
మొత్తం	**9.83**	**24.56**	**40**	**52.03**	**64.02**	**74.21**	**82.63**


దుర్భాషలాడిన టీడీపీ నాయకులను అరెస్ట్ చేయాలని కోరుతూ అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఎస్సీ యువకులు


త్రోవగుంటలో ఎస్సీలపై దాడికి యత్నించిన టీడీపీ నాయకులను అదుపు చేస్తున్న పోలీసులు


వల్లూరులో ఏఎస్సై శ్రీధర్‌తో వాగ్వాదమాడుతున్న స్వామి

పచ్చ దండుపాళ్యం

- ఓటమి భయంతో దాడులకు పాల్పడిన టీడీపీ నేతలు
- దర్శిలో బరితెగించిన మామా కోడళ్లు.. రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నాలు
- దర్శి మండలంలోని బొట్లపాలెంలో టీడీపీ గూండాల దాడిలో 8 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలు
- దర్శిలో డీఎస్పీ మీద రాళ్లతో దాడులకు దిగిన పచ్చదండుపాళ్యం బ్యాచ్
- పుల్లలచెరువు మండలంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిపై దాడికి యత్నించిన ఎల్లో గూండాలు, గాలిలోకి కాల్పులు
- కంభం మండలంలోనూ కానిస్టేబుల్ మీద దాడికి యత్నం
- వెంగముక్కలపాలెంలో పోలీసుల నుంచి లాఠీలు లాక్కొని దాడి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఓటమి భయంతో తెలుగు దేశం పార్టీ గూండాలు రెచ్చిపోయారు. సోమవారం జరిగిన ఎన్నికల ఘట్టంలో జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించారు. దాడులకు తెగబడ్డారు. పుల్లల చెరువు మండలంలో ఏకంగా యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌పై దాడికి ప్రయత్నించడంతో పోలీసులు గాలిలోకి కాల్పులు చేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక దర్శి నియోజకవర్గంలో నరసరావుపేట నుంచి రౌడీలను తరలించి నిస్సిగ్గుగా రిగ్గింగులకు పాల్పడేందుకు తెగబడ్డారు. పచ్చదండు పాళ్యం దాడిలో 8 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తల తలలు పగిలాయి.

పోలీసుల లాఠీ లాక్కొని ..

ఒంగోలు నియోజకవర్గంలో ఓటమి భయంతో టీడీపీ గూండాలు బరితెగించారు. వెంగముక్కల పాలెంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాన్ని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద దాడి చేశారు. పోలీసుల చేతిలోని లాఠీ లాక్కొని దారుణంగా చితకబాదారు. ఉమామహేశ్వర కాలేజీ సమీపంలో టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ నాయకత్వంలో 200 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద అకారణంగా దాడికి పాల్పడ్డారు. కర్రలతో ఒక్కసారిగా అంత పెద్ద గుంపు దాడికి తెగబడడంతో భయాందోళనకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రాణభయంతో దగ్గరలో ఉన్న అపార్ట్‌మెంట్‌లోకి పారిపోయి దాక్కునేందుకు ప్రయత్నించారు. అయినా వదలిపెట్టని పచ్చ గూండాలు వెంటాడి మరీ కొట్టారు. ఆగ్జిలియం స్కూలులో రిగ్గింగుకు పాల్పడినట్లు సమాచారం రావడంతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అక్కడికి చేరుకున్నారు. ఆయన తిరిగి వస్తుండగా టీడీపీ కార్యకర్తలు రెచ్చగొడుతూ నినాదాలు చేశారు. ఆగ్జిలియం స్కూలు నుంచి శ్రీనివాస థియేటర్ వరకు పచ్చ గూండాలు రచ్చ చేస్తూనే ఉన్నారు. అయినా బాలినేని సంయమనం పాటించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు రెచ్చి పోకుండా నిలువరించారు. పచ్చదండుపాళ్యం చేష్టలకు ఇస్లాంపేట, గోపాల్ నగర్ ప్రజలు ఈసడించుకున్నారు. పోలింగ్ సరళిని గమనించిన తెలుగు గూండాలు ఓటమి భయంతోనే నగరంలో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


రాళ్లు రువ్వుతున్న టీడీపీ నాయకులు

■ కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోనూ టీడీపీ నేతలు దాష్టీకానికి పాల్పడ్డారు. సీఎస్ పురం గ్రామంలో 84వ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్ సీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపించారు. సమాచారం అందుకొని అక్కడికి వెళ్లిన పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మేకల తిరుపతి యాదవ్ (బాలు) మీద దాడి చేసి చితకబాదారు.

■ పామూరులో కూడా వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద పచ్చదండు పాళ్యం దాడికి ప్రయత్నించింది.

■ గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం మండలంలోని లింగోజి పల్లి గ్రామంలో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన టీడీపీకి చెందిన ఒక మహిళను ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారిని బయటకు పంపించిన కానిస్టేబుల్ మీద ఎల్లో గ్యాంగ్ దాడికి పాల్పడేందుకు ప్రయత్నించింది.

■ కొమరోలు మండలం చింతలపల్లె పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను ప్రలోభపెట్టేందుకు స్థానికేతరులైన టీడీపీ నాయకులు యత్నించగా వైఎస్సార్ సీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఎందుకొచ్చారని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చిట్టేటి వెంకటేశ్వర్లు, ఎస్సీ వర్గానికి చెందిన సుశీల్‌పై దాడికి యత్నించారు. స్థానికులంతా తిరగబడటంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అదే సమయంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అక్కడికి చేరుకుని అరగంటకు పైగా హడావుడి చేయడంతో ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యారు.

■ కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు మండలం వేంపాడు టీడీపీ గూండాలు వైఎస్సార్ సీపీ కార్యకర్త ఎర్ర సుధాకర్ మీద దాడి చేసి తల పగులగొట్టారు. తీవ్రంగా గాయాలు కావడంతో ఆయనను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

■ మార్కాపురంలోని రెడ్డి మహిళా కాలేజీ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. మున్సిపల్ ప్రైమరీ స్కూల్ బూత్‌లో టీడీపీ తరఫున దొంగ ఓటు వేసేందుకు వచ్చిన వారిని అడ్డగించిన వైఎస్సార్ సీపీ ఏజెంట్ అజయ్‌కుమార్‌ను టీడీపీ నేతలు దుర్భాషలాడుతూ దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు సీఐతో మాట్లాడి ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని సూచించారు. మార్కాపురం 9వ వార్డులో మున్వర్, ఇబ్రహీం పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తుండగా టీడీపీ నాయకులు దాడి చేశారు. మార్కాపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ షంషేర్ అలీబేగ్, ఏఎంసీ డైరెక్టర్ మగ్బుల్ బాషా పరామర్శించారు.


■ పొదిలి మండలం నందిపాలెం ఎస్సీ కాలనీ పోలింగ్ బూత్‌లోకి టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తనయుడు విష్ణుష్‌రెడ్డి అనుమతి లేకుండా ప్రవేశించడంతో వైఎస్సార్ సీపీ ఏజెంట్లు అడ్డుచెప్పారు. వారిని విష్ణుష్ రెడ్డి నోటికొచ్చినట్టు బూతులు తిట్టడంతో వైఎస్సార్ సీపీ నేత తను బుద్ధి రమణారెడ్డి పద్ధతి కాదని వారించారు. అంతటితో ఆగని విష్ణుష్‌రెడ్డి బయటకు వచ్చి తన అనుచరులతో కలిసి రాళ్లదాడికి దిగారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు వేగంగా స్పందించి రాళ్ల దాడిని తిప్పికొట్టారు. టీడీపీ కార్యకర్తలకు ముగ్గురికి గాయాలయ్యాయంటూ కందుల నారాయణరెడ్డి డ్రామాకు తెరలేపారు.

■ టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామంలో టీడీపీ అభ్యర్థి స్వామి ఎలక్షన్ నిబంధనలు అతిక్రమిస్తూ హల్‌చల్ చేశారు. తన మందీమార్బలంతో ఏకంగా పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి హంగామా సృష్టించారు. ఈ ఘటన మండల పరిధిలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్న తరుణంలో టీడీపీ అభ్యర్థి డోలా బాల వీరాంజనేయ స్వామి తన సోదరుడు శ్రీధర్‌తో సహా సుమారు 20 మంది అనుచరులతో పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం వాహనాలు 100 మీటర్ల అవతల నిలుపుదల చేయాల్సి ఉన్నా.. పోలింగ్ బూత్ సమీపంలోనే పార్కింగ్ చేశారు. ఇది తగదని వారించిన పోలీసు సిబ్బందితో పాటు మహిళా పోలీస్‌పై జులుం ప్రదర్శించారు. మహిళా పోలీస్ అని చూడకుండా ఆమె ఐడీ కార్డు చూపించాలని.. అసలు తనను ఆపడానికి నీవెవరిని రెచ్చిపోయారు. అక్కడే ఉన్న ఏఎస్ఐ అడ్డుకోబోగా దుర్భాషలాడారు. యథేచ్ఛగా పోలింగ్ బూత్‌లోకి వారంతా వెళ్లి కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చారు. జిల్లాలో ఓటమి భయంతో దాడులకు తెగబడిన తెలుగుదేశం పార్టీ తీరుపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దర్శిలో పోలీసుల మీద రాళ్ల దాడికి తెగబడి..

దర్శి నియోజకవర్గంలో పచ్చదండు పాళ్యం బరితెగించింది. నరసరావుపేట నుంచి రౌడీ మూకలను దించి ఓటర్లలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నించింది. ఏకంగా ఈవీఎం మిషన్లు ఎత్తుకెళ్లేందుకు శతధా ప్రయత్నించి విఫలమైంది. మండలంలోని బొట్లపాలెంలో టీడీపీ గుండాలు రిగ్గింగు చేసేందుకు ప్రయత్నించడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దాంతో రెచ్చిపోయిన ఎల్లో గ్యాంగ్ కర్రలు, రాళ్లతో దాడి చేసింది. ఈ దాడిలో 8 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తల తలలు పగిలాయి. పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లోకి సాయంత్రం 6 గంటల సమయంలోకి వెళ్లిన టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి బయటకు రాకుండా సుమారు గంటసేపు తిష్ట వేశారు. దాంతో ఉద్రిక్త వాతావరణం తలెత్తింది. ఈ లోపు అక్కడికి చేరుకున్న లక్ష్మి మామ కడియాల వెంకటేశ్వరరావు, సోదరుడు గొట్టిపాటి భరత్ కూడా బూత్‌లలోకి ప్రవేశించారు. రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నించారు. ఓటేసేందుకు వచ్చిన ప్రజలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. దాంతో వివాదం జరిగింది. చిలికి చిలికి గాలివానలా మారి తోపులాట జరిగింది. సమాచారం తెలుసుకొని డీఎస్పీ అశోక్ కుమార్ అక్కడకు ఇరువర్గాలను సముదాయించి పరిస్థితిని చక్కదిద్దారు. అయినా ఊరుకోకుండా లక్ష్మితో పాటుగా ఆమె మామ కడియాల వెంకటేశ్వర్లు, నరసరావుపేట గ్యాంగ్ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ బూతులు లంకించుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను దూషించారు. దీంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే నరసరావుపేట ఎల్లో గ్యాంగ్ డీఎస్పీ, సీఐ, పోలీసు సిబ్బంది మీద రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో తమిళనాడుకు చెందిన కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఆయన అక్కడికక్కడే కింద పడిపోయారు. డీఎస్పీ సైతం పోలీసుల రక్షణలో ప్రాణాలు కాపాడుకున్నారు. అంతేకాకుండా దేవవరం గ్రామంలో కూడా లక్ష్మి కుటుంబ సభ్యులు రౌడీయిజం ప్రదర్శించారు. నరసరావుపేట నుంచి తరలించిన గుండాలతో కలిసి లక్ష్మి భర్త లలిత్ సాగర్ హంగామా సృష్టించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద దాడి చేసి తలలు పగులగొట్టారు. తూర్పు వెంకటాపురం గ్రామంలో ఓట్లు వేయడానికి వచ్చిన దళితులను మా ఊరెందుకు వచ్చారంటూ టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. వారి మీద దాష్టీకానికి పాల్పడ్డారు. దర్శి నియోజకవర్గంలో ఏకంగా ఈవీఎంలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు వారి కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టారు.


టీడీపీ రౌడీలు లోపలకు రావటంతో ప్రశ్నిస్తున్న ఓటర్లు


పగలగొట్టిన ఈవీఎం


అల్లరి మూకలను చెదరగొడుతున్న పోలీసులు

పుల్లలచెరువులో గాలిలోకి పోలీసుల కాల్పులు...

యర్రగొండపాలెం నియోజకవర్గంలోనూ ఎల్లో గ్యాంగ్ తెగబడింది. తెలుగుదేశం గూండాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ పై దాడికి ప్రయత్నించారు. పోలింగ్ బూత్ వద్దకు పరిశీలన కోసం వచ్చిన చంద్రశేఖర్ మీద టీడీపీ గుండాలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆయన మీద రాళ్లు, కర్రలతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే రెండు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు బుల్లెట్ క్యాప్ తగిలడంతో గాయమైంది. పుల్లలచెరువు మండలంలోని పీవీ పల్లెలో కూడా తెలుగు గుండాలు తాటిపర్తి చంద్రశేఖర్ మీద దాడికి ప్రయత్నించాయి. శతకోడులో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ వర్గీయులు వైఎస్సార్ సీపీ వర్గీయులతో ఘర్షణకు దిగి రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో ముటుకుల సొసైటీ అధ్యక్షుడు కిలారి కృష్ణ తలకు తీవ్రగాయమైంది. యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రపురంలో కూడా తెలుగు గూండాలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద దాడులకు బరితెగించారు. పెద్ద బోయలపల్లె, పుల్లలచెరువు మండలంలోని సిద్ధనపాలెం, శతకోడు గ్రామాల్లో టీడీపీ వర్గీయులు తీవ్ర అలజడి సృష్టించారు. పెద్దబోయలపల్లెలో పోలింగ్ కేంద్రం వద్ద ఓట్లు వేయటానికి క్యూలో నిలబడిన వైఎస్సార్ సీపీ ఓటర్లను టీడీపీకి చెందిన కొంతమంది నెట్టివేశారు. దీంతో వారిమధ్య తీవ్రంగా ఘర్షణ జరిగింది. ఈ సమయంలో టీడీపీ వర్గీయులు రాళ్లు రువ్వడంతో వైఎస్సార్ సీపీ నాయకుడు వీరగంధం వెంకటసుబ్బయ్య తలకు తీవ్రంగా గాయమైంది. సిద్ధనపాలెంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మెజార్టీ ఓట్లు పోలవుతున్నాయన్న ఉద్దేశంతో పోలింగ్‌ను అడ్డుకున్నారు.


పెద్దబోయలపల్లెలో పోలింగ్ బూత్ వద్ద ఘర్షణకు దిగిన టీడీపీ వర్గీయులు

ఎస్సీలపై టీడీపీ జులుం

- తక్షణమే స్పందించి అడ్డుకున్న పోలీసులు
- టీడీపీ గూండాలను అరెస్టు చేయాలని ఎస్సీల రాస్తారోకో, అర్ధనగ్న ప్రదర్శన
- శాంతింపజేసిన పోలీసులు


ఒంగోలు సెంట్రల్: త్రోవగుంటలో ఎస్సీలపై టీడీపీకి చెందిన ఒక సామాజికవర్గం వారు దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారు. సోమవారం ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా ఈ సంఘటన జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి అడ్డుకున్నా ఫలితం లేకపోవడంతో చివరికి ప్రత్యేక పోలీస్ బృందం రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టింది. తమను దుర్భాషలాడి కులం పేరుతో దూషించడంపై ఒంగోలు–చీరాల ప్రధాన రహదారిపై ఎస్సీలు రాస్తారోకోకు దిగారు. పూర్తి వివరాల్లోకెళ్తే.. త్రోవగుంట ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌లలో కేవలం ఎస్సీ, బీసీ వర్గీయులవే అధికంగా ఓట్లు ఉన్నాయి. ఉదయం నుంచే అధిక సంఖ్యలో ఓటర్లు బారులుదీరారు. అదే ప్రాంతంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లలో కేవలం టీడీపీకి చెందిన సామాజికవర్గం వారి ఓట్లు అధికంగా ఉన్నాయి. అక్కడ ఓటింగ్ ప్రశాంతంగా జరుపుకుని ఎస్సీ, బీసీ వర్గీయులు అధికంగా ఉన్న బూత్‌ల వద్ద అలజడి సృష్టించి ఓటింగ్ శాతం తగ్గించేందుకు టీడీపీ వర్గీయులు ఉదయం నుంచి ప్రయత్నాలు ప్రారంభించారు. అందులో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్ వచ్చిన సమయంలో బూత్‌ను సందర్శించి వెళ్తుండగా ఒక్కసారిగా వచ్చిన టీడీపీ వర్గీయులు 'ఏమిరా మీకు బలిసిందా.. జనార్దన్ వచ్చిన సమయంలో కూడా కూర్చునే ఉంటారా..? పైకి లేవరా..? మీ సంగతి చూస్తాం' అంటూ దుర్భాషలాడటంతో గొడవ మొదలైంది. వైఎస్సార్ సీపీ వర్గీయులు ఉన్న చోటికి కూడా వచ్చి టీడీపీ వారు దాడికి ప్రయత్నించారు. ఈ బూత్‌లో ఓట్లు లేని వారు ఈ ప్రాంతానికి వచ్చి తమను దుర్భాషలాడి ఓటింగ్ సక్రమంగా జరగకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని... ఇవిగో మా ఓటరు కార్డులంటూ ఎస్సీ యువకులు పోలీసులకు తెలిపారు. అయినా సరే టీడీపీ వర్గీయులు దాడికి ప్రయత్నిస్తుండటంతో ఎస్సీ యువకులు గుమికూడి తమను కులం పేరుతో దూషిస్తూ దాడికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రోడ్డుపై కూర్చుని నిరసనకు దిగారు. ఎస్సీ, బీసీలపై దుర్భాషలాడి దాడి చేస్తున్న టీడీపీ సామాజికవర్గ నాయకుల అరాచకాలను అరికట్టాలని, తమకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శనకు దిగారు. సోమవారం ఉదయం అదే ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా శింగయ్యను టీడీపీ నాయకుడు మండవ రాఘవరావు 'ఏమిరా ఎలా ఉందిరా.. నీ తలకాయ తీస్తా'... అంటూ మాట్లాడగా స్వల్ప వివాదం జరిగింది. పోలీసులు సర్దుబాటు చేశారు. ఆ తర్వాత పోలింగ్ బూత్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎందుకు దురుసుగా ప్రవర్తించటం అంటూ బూత్ పరిసరాల్లో ఉన్న మండవ రాఘవరావును ప్రశ్నించగా, పక్కనే ఉన్న టీడీపీ కార్యకర్తలు సైతం దురుసుగా మాట్లాడటంతో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సంయమనం పాటించాలని బాలినేని సర్దిచెప్పారు.

టీడీపీ నాయకునిపై కేసు నమోదు, అరెస్టు

మద్దిపాడు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన టీడీపీ నాయకునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు మద్దిపాడు ఎస్ఐ వి.మహేష్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని లింగంగుంట గ్రామంలో టీడీపీ నాయకుడు కృష్ణ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ పోలింగ్ బూత్‌ల సమీపంలో డబ్బులు పంచుతుండగా పట్టుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) నిబంధనల కింద అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, వారి కోడలు శ్రీకావ్య, ఇతర కుటుంబ సభ్యులు స్థానిక ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రాంనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకోగా, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్ దంపతులు కూడా స్థానిక ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ పోలింగ్ బూత్‌లో ఓటేశారు. నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు వారి పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంతపేటలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలుర వికలాంగుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన 157వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.


ఒంగోలులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు